నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

అచ్చంపేట: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించొద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలో పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. సీడ్స్ స్టాక్స్, గోదాంలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల స్టాక్ రిజిస్టర్లు నిర్వహణ, బిల్లులు, సీడ్ లేబుల్ పరిశీలించారు. ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్‌ఐ రమేష్, ఏఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో సాయితేజ ట్రేడర్స్, మన గ్రోమోర్ సెంటర్‌లను ఏఓ వికాస్, వ్యవసాయ విస్తరణాధికారి విష్ణు, ఎస్‌ఐ రామన్‌గౌడ్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు.



అచ్చంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఆకస్మికంగా తనిఖీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ కృష్ణయ్యతో కలిసి సీఐ రవీందర్, ఎస్‌ఐ రమేష్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. డీలర్లు నిబంధనలు పాటించాలని సూచించారు.

తాడూరు: ఎరువులు, మందులకు సంబంధించి కొనుగోలు చేసిన వాటికి రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఏఓ సందీప్‌కుమార్, ఎస్‌ఐ గురుస్వామి సూచించారు. గుంత కోడురులో ఫర్టిలైజర్ దుకాణాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన విత్తనాలు ఉంచొద్దన్నారు.

కళలతో సృజనాత్మకత

కొల్లాపూర్: కళలతో సృజనాత్మకత పెంపొందతుందని సీఐ మహేష్, ఎస్‌ఐ హృషికేష్‌లు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును వారు గురువారం సందర్శించారు. పేరిణి నృత్యం, జానపద నృత్యాలు, పెయింటింగ్, సంగీతం శిక్షణా తరగతులను వారు పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులు, మహిళలతో మాట్లాడారు. శిక్షణకు సంబంధించిన అంశాలను ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని గుర్తించేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు దోహదం చేస్తాయన్నారు. సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసిన ఫౌండేషన్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిరంజన్‌రావు, నాయకులు అన్వర్‌పాషా, సురేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ మహేష్

గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ

చారకొండ: మండలంలోని జూపల్లి, జేపల్లి గ్రామాల్లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన మెడికల్ కిట్లను గురువారం గర్భిణులకు ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య చారి, శ్రీరాములు, భిక్షపతి యాదవ్, యువకులు మున్నా, ప్రశాంత్, మల్లేష్, సైదులు మహిళలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంలో గురువారం మండలంలోని తోటపల్లి, మార్చాలా గ్రామాల్లో గర్భిణులకు ఆరోగ్య కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేష్, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మాచర్లలో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో కిట్లు అందిస్తున్న నాయకులు

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్లకు చెందిన గౌరమ్మకు రూ.21వేలు, పార్వతమ్మకు రూ.6వేలు, నరేష్ రూ.21500లు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ బాధితులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవికుమార్, రాజు, రామకృష్ణ, చిన్న సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డికి నివాళి

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్‌లో గురువారం బూసి రామచంద్రారెడ్డి 16వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ మాట్లాడారు. రామచంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సైదులు, మణిపాల్‌రెడ్డి, రాములు, శివకుమార్, నిర్మల, సైదమ్మ పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామానికి సంబంధించిన వీరమనాయిని చెరువును మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు గురువారం మేజర్ ఇరిగేషన్ శాఖ అధికారులు ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ అమర్‌సింగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుకు కేఎల్‌ఐ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నామని వివరించారు. సమీపంలో ఉన్న బీమా కాల్వ, పసుపుల కాల్వ, సింగోటం రిజర్వాయర్‌లు ఉన్నాయని వీటిలో ఎక్కడి నుంచి నీటి సరఫరా చేస్తే మేలు చేకూరుతుందో పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ యంపీపీ నిరంజన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన నాగర్‌కర్నూల్ జట్టు

కందనూలు: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగర్‌కర్నూల్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ ఇంట్రా డిస్ట్రిక్ లీగ్ మ్యాచ్‌లో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 62 పరుగుల తేడాపై విజయం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ పరిశీలకులు ముక్త్యార్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జులు సతీష్, మోసిన్, కోచ్‌లు రమేష్‌గౌడ్, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించాలి

కొల్లాపూర్: నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు చేపట్టాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు దార శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సాంఘీక సంక్షేమ గురుకులాలను మూసివేసి పేద విద్యార్థులను చదువులకు దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మధిర, కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు భూమి పూజలు చేసి ఏడాది కావొస్తున్నా ఇప్పటివరకు భవనాలు మాత్రం నిర్మించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో నాయకులు శివ, రాము, వెంకటేష్ ఉన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

తిమ్మాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తహసీల్దార్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మరికల్‌లో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత ధాన్యం సేకరిస్తున్నారు. ఎంత ధాన్యం రవాణ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గన్నీ సంచులు కొరత లేకుండా చూడాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



కల్వకుర్తి రూరల్: శాస్త్రవేత్తల సూచనలు రైతులు తప్పనిసరిగా పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సయ్యద్ హుస్సేన్, డాక్టర్ ప్రీతిలు కోరారు. గురువారం మండలంలోని ముకురాలలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా రసాయన ఎరువులను తగ్గించాలని, భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని, నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ఎరువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలని సూచించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

తిమ్మాజీపేట: గొరిట గ్రామాన్ని తిమ్మాజీపేట మండల కేంద్రంలోనే ఉంచాలని కోరతూ గురువారం గ్రామస్తులు నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి, కలెక్టర్ బదావత్ సంతోష్‌కు విజ్ఞప్తి చేశారు. బిజినపల్లి మండలంలోని మంగనూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా మార్చితే అభ్యంతరం లేదని తెలిపారు. గొరిట మంగనూర్‌లో చేర్చొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీకి సన్మానం



మన్ననూర్: నల్లమల ప్రాంతంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిని గురువారం మన్ననూర్‌లోని అటవీశాఖ విశ్రాంతి గృహంలో అమ్రాబాద్, మన్ననూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో హరినారాయణ, డాక్టర్ సురేష్, పంబలి బుచ్చయ్య, ఎంపీ రహీం, సత్యనారాయణ, రవి, యశ్వంత్, సెవ్వ బాలు, తుల్యా, గోపాల్, కర్ణయ్య ఉన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు



తాడూరు: మండలంలోని ఇంద్రకల్, ఐతోల్, సిర్సవాడ ఆవంచ మీదుగా జడ్చర్లకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికుల సమస్యను వివరించగా ఎమ్మెల్సీ స్పందించి ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సు సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం డీఎం యాదయ్య బస్సును ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ నుంచి ఉదయం సాయంత్రం రెండు సార్లు బస్సు నడుపుతున్నట్లు డీఎం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేష్, గ్రామస్తులు లింగం, వెంకట్‌రాములు, జంగయ్య ఉన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పెంట్లవెల్లి: అచ్చంపేటలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మండలంలోని పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండలం నుంచి 7 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. ప్రతిభ కనబరిచినవారిని గ్రామస్తులు అభినందించారు. ఈ నెల 31, వచ్చే నెల 1వ తేదీన ఘట్‌కేసర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయిపోటీలో పాల్గొంటారని తైక్వాండో కోచ్ రామకృష్ణ తెలిపారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి

తిమ్మాజీపేట: వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రాజేశ్వరి ఉపాధిహామీ అధికారులకు సూచించారు. మండలంలోని మన్యనాయక్ తండాలో గురువారం ఉపాధి పనులను పీడీ పరిశీలించారు. ఈ ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా లక్షా 94 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టున్నామన్నారు. అనంతరం పాంపాండ్ పనులను పరిశీలించారు. మరికల్ గ్రామ సమీపంలో నర్సరీలో మొక్కలను పరిశీలించి ఉపాధి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఏపీఓ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు బాల్‌రాజ్, తాజుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుజాత, అనిత ఉన్నారు.

బాధితులకు పరామర్శ

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెన్న మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదే విధంగా రాకొండ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, కొండ నాగేష్, బిక్కు సాయబ్, ఆంజనేయులు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ కేంద్రం ఉద్యోగుల నిరసన

దోమలపెంట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్రంలో నిరసన తెలిపిన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం టీపీస్పీఈ, జేఏసీ పిలుపుమేరకు ఈగలపెంటలో భూగర్భ కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు మధ్యాహ్న విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. భూగర్భ కేంద్రం జేఏసీ చైర్మన్ సునీందర్, కన్వీనర్ చరణ్ తెలిపారు.

ప్రణాళికపై సమావేశం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో ప్రభుత్వం చేపట్టబోయే 100 రోజుల ప్రణాళికపై కమిషనర్ మహమూద్ షేక్ సమావేశం నిర్వహించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ప్రారంభమయ్యే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కలు నాటడం, దోమల నివారణకు చర్యలు, పట్టణ అభివృద్ధి తదితర అంశాలను ప్రణాళికలో చేపట్టనున్నామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఏఈ షబ్బీర్, మేనేజర్ రాజకుమారి, ఇన్‌స్పెక్టర్ రంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై కళాజాత బృందం ప్రచారం

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కళాజాత బృందం సభ్యులు సంక్షేమ పథకాలపై ప్రదర్శన ద్వారా వివరించారు. పాటల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ, విద్యా సంబంధమైన తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి



కోడేరు: ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ కోరారు. గురువారం ఆయన సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కోసం కుట్ర చేస్తుందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, యాగశివయ్య, ఆంజనేయులు, రేణయ్య పాల్గొన్నారు.

గో వధశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గో వధశాలలపై చర్యలు తీసుకోవాలని భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సంయోజక్ పులి భరత్ మాట్లాడుతూ పట్టణంలో అక్రమంగా గోవధ శాలలు నిర్వహిస్తున్నారని, హిందువులు దైవంగా భావించే ఆవులతో పాటు, లేగ దూడలను, వ్యవసాయ యోగ్యమైన ఎద్దులను రైతుల నుంచి కొనుగోలు చేసి మాంసం కోసం వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వధశాలలను తనిఖీలు చేసి నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మహేష్, రవి, శివమణి, సాకేత్, హేమంత్, గణేష్, శివశర్మ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న భజరంగ్‌దళ్ నాయకులు

తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర అమోఘం

నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం పాత్ర అమోఘమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజేఎఫ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సొంత ఇంటి కలను నెరవేరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, జాతీయ నాయకులు జెమిని సురేష్, హౌదే కార్ ఉమాశంకర్, టీయూడబ్ల్యూజే(హెచ్143) జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్, సీనియర్, ఫొటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కపిలవాయి రాజు, నాయకులు గోరటి శ్రీరాములు, షేక్ ఫరీద్ అహ్మద్, ఆవుల భాస్కర్ బాబు, సత్యం, బాలస్వామి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

యువ వికాసం పథకంపై సమీక్ష

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని అధికారులకు సూచించారు. యువ వికాసం పథకానికి రూ.6600 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బిజినేపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా ఆయుష్ ప్రోగ్రాం అధికారి డా. సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ భవనంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయుష్ జిల్లా అధికారి డా.సురేష్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజు కొన్ని యోగాసనాలు అనుసరించాలని, యోగాకు సంబంధించిన ఎన్నో అంశాలు సామాజిక మాధ్యమాల్లో విరివిగా లభ్యం అవుతున్నాయన్నారు. ప్రతి మనిషి భవిష్యత్ యోగాతోనే ముడిపడి ఉండటమే కాకుండా యోగానే కీలకమన్నారు. ఆయుర్వేద వైద్యాధికారి అజహర్ మహ్మద్, పంచాయతీ కార్యదర్శి మహేష్, బాబా, ప్రభుత్వ యోగా శిక్షకులు శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి డా.సురేష్

అందుబాటులో జీలుగ విత్తనాలు

లింగాల: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9.9 క్వింటాళ్ల విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పేర్కొన్నారు. 30 కిలోల బ్యాగ్ రూ.2,138లకు విక్రయిస్తున్నట్లు విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం, జిరాక్స్‌లు ఏఈఓలకు ఇచ్చి విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ శంకర్ నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు గణితం, ఇంగ్లీష్, తెలుగు తదితర అంశాలపై నేర్చుకున్న మెళకువలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కమిటీ కన్వీనర్ చెన్నయ్య, కో కన్వీనర్ వెంకటయ్య, పద్మ, పవన్, పద్మ, కృష్ణగౌడ్, వెంకటేశ్వర్లు, కొండయ్య, ఏపీ మల్లయ్య, పులిజాల పరశురాములు, చిన్నయ్య, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం



కల్వకుర్తి టౌన్: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు మండలాలలకు చెందిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందజేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ సమస్య రాకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అనంతరం కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాలలోని 50 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులు, విద్యుత్‌శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



తిమ్మాజీపేట: కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి కోరారు. మంగడ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసింగ్ వ్యవస్థలోని 7 అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో 100కు ఫోన్ చేయాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష పాటించొద్దని కోరారు. ఎవరైన సైబర్ నేరానికి గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

బురదమయంగా తాత్కాలిక రోడ్డు



కోడేరు: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా తీగలపల్లిలో బీటీ రోడ్డు ముంపునకు గురైంది. అధికారులు తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహతో పాటు సీపీఎం నాయకులు రోడ్డును పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తైనా అధికారులు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, రమేష్, రేణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



కల్వకుర్తి రూరల్: పేదలకు ఎల్లప్పుడు సీపీఐ అండగా ఉంటుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్ నరసింహ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల మూడో మహాసభలను సీపీఐ కార్యదర్శి పులిజాల పరశురాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను విస్మరించాయని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దాసు, రాజు, పురుషోత్తం, శ్రీరాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

తెలకపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని స్వేరోస్ కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో స్వేరోస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులను తీసివేసి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. విద్యార్థులు శానిటేషన్ పనులు చేయాలని గురుకులాల కార్యదర్శిగా పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలుగు వర్షిణిని వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, రమేష్, పరమేశ్వర్, రవికుమార్, చంద్రశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి

పాన్‌గల్: విశిష్ట సంఖ్య కోసం రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించి పలువురి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతుల భూముల వివరాలను నమోదు చేస్తుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, పట్టదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో ఏఈఓలను సంప్రదిస్తే వివరాలను నమోదు చేస్తారన్నారు.